# సంపాదకీయం

## రాష్ట్రాలకు కోత పెడుతున్న మోడీ సర్కార్ ?

దేశంలోని 28 రాష్ట్రాలు ఉన్నాయి. అయితే బీజేపీ పాలిత రాష్ట్రాలు ఎన్డీయే పాలిత రాష్ట్రాలు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు అన్న వివక్ష ఉందని ఇండియా కూటమి నేతలు అంటూంటారు. బీజేపీ రాష్ట్రాలకు రూపాయికి ఏడు రూపాయల దాకా కేంద్రం నుంచి నిధులు అందుతాయని అదే విపక్షాల రాష్ట్రాలకు ఎంత ఆదాయం కేంద్రానికి పన్నుల రూపంలో ఇచ్చినా నలభై నుంచి యాభై పైసల వద్దనే నిధులు ఇస్తారని విమర్శలు చేస్తూంటారు. ఇక జీఎస్టీ వచ్చాక రాష్ట్రాలు సొంతంగా పన్నులు వేసుకుని నిధులను పొందే సౌలభ్యం లేకుండా పోయింది అన్నది ఉంది. అంతే కాదు బీజేపీ ఏలుబడిలో స్పెషల్ గ్రాంట్స్ అన్నవి కూడా పెద్దగా లేవని రాష్ట్రాల పట్ల సానుకూలత ఉంటే ఉదారంగా అప్పులు చేసుకునేందుకు మాత్రమే వీలు కల్పిస్తుందని కూడా విమర్శిస్తుంటారు. ఇక ప్రకృతి విపత్తులు వచ్చినపుడు కూడా కేంద్రం నుంచి గతంలో మాదిరిగా పెద్దగా సాయం ఇపుడు అందడం లేదు అన్నది కూడా చర్చగా ఉంది. ఇవన్నీ ఇలా ఉంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ద్రవ్య లోటుని పూడ్చుకునేందుకు రాష్ట్రాలకు పన్నుల ద్వారా ఇవ్వాల్సిన వాటాలలో కోత పెట్టడానికి చూస్తోంది అన్నది ఇపుడు ఒక ప్రచారంగా ముందుకు వస్తోంది. రాష్ట్రాలకు కేంద్రం నుంచి దక్కాల్సిన పన్నుల వాటాను తగ్గించేందుకు ఆర్థిక శాఖ ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లుగా రాయిటర్స్ ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం ప్రకారం చూస్తే ఇప్పటిదాకా కేంద్రం నుంచి రాష్ట్రాలకు పన్నుల ద్వారా 41 శాతం వాటా వచ్చేది. తాజా ప్రతిపాదనల ప్రకారం దీనిని ఒక్క శాతం వాటా తగ్గించి నలభై శాతానికి పరిమితం చేయాలని చూస్తోంది అని అంటున్నారు. ఇలా కేవలం ఒక్క శాతం వాటాలో కోత పెట్టడం వల్ల కేంద్రానికి ఏకంగా 35 వేల కోట్ల రూపాయల ఆదాయం మిగులుతుందని రాయిటర్స్ కథనం వెల్లడించింది. ఆర్థికవేత్త అరవింద్ పనగరియా నాయకత్వంలోని ఆర్థిక సంఘానికి ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రతిపాదించినట్లుగా చెబుతున్నారు. ఈ నెలాఖరులో జరిగే కేంద్ర మంత్రివర్గ భేటీలో ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసి ఆ మీదట పరిశీలన కోసం ఆర్థిక సంఘానికి పంపుతారని అంటున్నారు. ఇక ఈ నిర్ణయానికి ఆర్థిక సంఘం కనుక ఓకే చెబితే 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ కోత అమలులోకి వస్తుంది. దాని వల్ల రాష్ట్రాలకు దక్కే కేంద్ర పన్నులలో వాటా సొమ్ము గణనీయంగా తగ్గిపోతుంది అని అంటున్నారు. దీని వల్ల రాష్ట్రాలు మరింతగా ఆర్థికంగా ఇబ్బందులోకి వెళ్తాయని చెబుతున్నారు. ఇప్పటికే ఏపీ లాంటి రాష్ట్రాలు అప్పుల మీద నడుస్తున్నాయి. ఇక మీదట సంక్షేమానికి కాదు కదా అభివృద్ధికి కూడా నిధుల కోసం తీవ్ర కొరత వస్తుందని అంటున్నారు. కేంద్రం ద్రవ్య లోటుని పూడ్చుకోవడానికి రాష్ట్రాల పన్నుల వాటలో కోత పెట్టడం ఏమిటి అన్నది విపక్షాల నుంచి మెల్లగా వినిపిస్తోంది. కేబినెట్ ఆమోదం తెలిపిస్తే మరి విపక్షాలు ఏ రకంగా ప్రతిఘటిస్తాయన్నది చూడాల్సి ఉంది.

# విలీన గ్రామాలపై ప్రత్యేక దృష్టి



కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో విలీన గ్రామాలు, పురపాలికల పరిధిలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా, సేవల్లో సమస్యలు రాకుండా కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. కొత్తపల్లి పురపాలికతోపాటు చింతకుంట, మల్కాపూర్-లక్ష్మీపూర్, బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామపంచాయతీలు నగరపాలికలోకి కలిసిపోయాయి. పురపాలిక, పంచాయతీ బోర్డుల స్థానంలో వార్డు కార్యాలయాలుగా నామకరణం చేశారు. గ్రామాల్లోని రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఆస్తిపన్నులు, తదితర రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్నారు.

**నిలిచిన గ్రామ, పురపాలిక వెబ్‌సైట్**

విలీనం కాకముందు పంచాయతీ పోర్టల్‌లో గ్రామాల పేర్లు కనిపించేవి. దీని ఆధారంగానే భవన అనుమతులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే వారు. ప్రస్తుతం ఆ వెబ్‌సైట్ నుంచి గ్రామాల పేర్లను తొలగించారు. కొత్తపల్లి పురపాలికకు సంబంధించిన పేరు కూడా వెబ్‌సైట్‌లో కనిపించడంలేదు. జిల్లాలో మూడు పురపాలికలు, ఒక కార్పొరేషన్‌గానే సూచిస్తుంది. అంటే కొత్తపల్లి కార్యకలాపాలన్నీ కరీంనగర్ కార్పొరేషన్‌లోకి బదిలీ కానున్నాయి.

**బల్దియా ప్రకారమే పారిశుద్ధ్య పనులు** కొత్తపల్లితోపాటు విలీన గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల్లో మార్పులు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఉదయం, మధ్యాహ్నంతోపాటు చెత్త సేకరణ పకడ్బందీగా జరిగేలా కార్మికులకు ఆదేశాలు జారీ చేశారు. కార్మికులుగా గుర్తించేందుకు ఆప్రాన్ ధరించాలని ఆదేశించారు. మురుగుకాలువలు శుభ్రం చేయాలని, రహదారులు ఊడ్చి ఎప్పటికప్పుడు ఫొటోలు వాట్సాప్ గ్రూపులో పెట్టాలని సూచించారు. త్వరలోనే వీరికి బయోమెట్రిక్ హాజరు అమలు చేయనున్నారు.

**తాత్కాలికంగా అనుమతులు, పన్నుల వసూలు..**

విలీన గ్రామాల్లోని ప్రజలకు ఇబ్బందులు రాకుండా తాత్కాలికంగా అనుమతులు, ఇతర పనులు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం నల్లా, ఆస్తి పన్నులను మాత్రం రసీదు పుస్తకాల ద్వారా తీసుకుంటున్నట్లు అధికారులు చెప్పారు. పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ సేవలందించేందుకు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు కమిషనర్ లేఖ రాసినట్లు సమాచారం. పాత ఆస్తి పన్ను ఎప్పటి వరకు ఉంటుంది? కార్పొరేషన్ ఆస్తి పన్ను ఎప్పటి నుంచి అమలు చేస్తారనేది రాష్ట్రం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఈ విధివిధానాలు ఖరారు కావడానికి కొన్ని నెలల సమయం పట్టవచ్చు.

**వార్డు అధికారులకు బాధ్యతలు..**విలీన గ్రామాల్లో కనీస సౌకర్యాల పర్యవేక్షణకు ఒక వార్డు అధికారిని కేటాయించి బాధ్యతలు అప్పగించేందుకు ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ కానున్నాయి. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు వంటి సమస్యలు ఎప్పటికప్పుడూ పరిష్కరించేలా వీరు చర్యలు తీసుకుంటారు. అయితే కొన్ని నెలలపాటు ఆయా గ్రామాల్లో పని చేస్తున్న ఉద్యోగులతోనే నడిపించాలని నిర్ణయించారు. పారిశుద్ధ్య కార్మికులను మినహాయిస్తే మిగతా వారందరికీ బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేశారు.





తేది 8.3.2025 రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీ.సివి ఆనంద్ ఐపిఎస్ డిజి కమిషనర్ ఆఫ్ పోలీసు, హైదరాబాదు గారు 4-మహిళా ఇన్ స్పెక్టర్లకు స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా బదిలీ చేసినారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ మహిళలు కూడా పురుషులతో సమానంగా అన్ని రంగాలలో పోటీ పడుతున్నారు, మీరు కూడా స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా మీ సత్తా చూపించాలని వారిని కోరినారు. వారికి శుభాకాంక్షలు తెలుపుతూ ఉత్తర్వులు అందజేసినారు. 1.శ్రీమతి జ్యోస్నా తల్లోజు ఎస్.హెచ్.ఓ డబ్లు పిఎస్ సెంట్రల్ జోన్ నుండి ఎస్.హెచ్.ఓ కాచిగూడ (L&O)పిఎస్ కు బదిలీ చేసినారు. 2.శ్రీమతి.దోమాట దిబోరా మేయిన్ పిసిఆర్ నుండి ఎస్.హెచ్.ఓ డబ్లు పిఎస్ సెంట్రల్ జోన్ కు బదిలీ చేసినారు. 3.శ్రీమతి చిట్టీ బుర్ర టాస్క్ ఫోర్స్ అడ్మిన్ నుండి ఎస్.హెచ్.ఓ సెక్రెటరియెట్(లేక్) పి.ఎస్ కు బదిలీ చేసినారు. 4.పి.వెంకట లక్ష్మీ సిసిసి నుండి ఎస్.హెచ్.ఓ ట్రాఫిక్ పిఎస్ నాంపల్లి కి బదిలీ చేసినారు.

వీరితో పాటు 1.చంద్ర కుమార్ కాగితా ఎస్.హెచ్.ఓ కాచిగుడా పిఎస్ నుండి మేయిన్ పిసిఆర్ కు బదిలీ చేసినారు. 2. శ్రీ.సత్య నారాయణ ముత్తి నేని ఎస్.హెచ్.ఓ సెక్రెటరియెట్(లేక్) పి.ఎస్ నుండి ఎస్.హెచ్.ఓ ట్రాఫిక్ పిఎస్ నల్లకుంట కు బదిలీ చేసినారు.

# వ్యవసాయ బావులు.. ప్రమాదానికి దారులు



పెద్దపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో రహదారులను అభివృద్ధి చేసిన అధికారులు.. రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావులను పట్టించుకోకపోవడంతో ప్రమాదకరంగా దర్శనవిస్తున్నాయి. బావులు, ఎస్సారెస్పీ కాలువలు, చెరువుల వెంట రహదారుల నిర్మాణం, విస్తరణ పనులు జరగడంతో రాత్రిళ్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణించడం సాహసంగా మారింది.

**ఇదీ పరిస్థితి**

జిల్లాలోని సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి, పెద్దపల్లి మండలం రంగంపల్లి వద్ద రాజీవ్ రహదారికి ఆనుకునే చెరువు ప్రవాహాలు వెళ్తున్నాయి. కానీ ఇక్కడ ఎలాంటి రక్షణ గోడలు నిర్మించలేదు. పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాల గుండా వెళ్లే ఎస్సారెస్పీ కాలువలు కూడా ప్రమాదకరంగా ఉన్నాయి. సుల్తానాబాద్ శివారులోని డి-83 కాలువలో గతంలో వాహనాలు పడిపోయిన ఘటనలు జరిగాయి. పెద్దపల్లిలోని కొంతంవాడ మీదుగా వెళ్లే ఎస్సారెస్పీ కాలువలోకి గతంలో కారు దూసుకెళ్లింది. కుమ్మరికుంట నుంచి జూలపల్లి వచ్చే ఆర్అండ్‌బీ రోడ్డు కొంతదూరం కాలువ వెంటే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. పెద్దపల్లి నుంచి కూనారం వెళ్లే దారిలో మారేడుగొండ, కాల్వశ్రీరాంపూర్ నుంచి గుంపులకు వెళ్లేదారిలో పలు బావులతో పాటు చెరువులు, కుంటలు రోడ్డు వెంటే ఉన్నాయి. ధర్మారం, మంథని, కాల్వశ్రీరాంపూర్‌లలో రహదారి విస్తరణ సమయాల్లో ప్రమాదకర బావులను పట్టించుకోలేదు. ముత్తారం మండలం మచ్చుపేట శివారు నుంచి దారి పొడవునా పది వరకు వ్యవసాయ బావులున్నాయి. పెద్దపల్లి నుంచి జూలపల్లి దారిలో వెంకట్రావుపల్లి, వడ్కాపూర్ సమీపంలో.. కుమ్మరికుంట నుంచి కొత్తూరు మీదుగా కటికెనపల్లి దారిలో.. పెద్దపల్లి నుంచి ముప్పిరితోట మీదుగా దూళికట్ట వెళ్లే రోడ్డులో.. జిల్లా కేంద్రం నుంచి తుర్కల మద్దికుంట వెళ్లేదారిలో గాంధీనగర్ దాటిన తరువాత.. బంధంపల్లి స్టేజీ వద్ద, బంధంపల్లి నుంచి గొల్లపల్లి వెళ్లేదారిలో మరో వ్యవసాయ బావులు రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్నాయి.

**గార్డ్ పోల్స్ ఏర్పాటు చేస్తాం**

రోడ్డు విస్తరణ జరిగిన ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉంది. ఇలాంటిచోట్ల ప్రమాదాల నివారణకు గార్డ్ పోల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాం. త్వరలోనే జిల్లా అంతటా పోల్స్ ఏర్పాటు చేయిస్తాం. - బావ్‌సింగ్, ఈఈ, ఆర్అండ్‌బీ

# ఆన్‌లైన్ సేవలకు దూరం

మల్యాల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో నగదు రహితసేవలు అందుబాటులోకి రాకపోవడంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. హుండీలో, నిత్యాన్నదాన సత్రానికి విరాళాలు ఇచ్చేందుకు నగదు లేక నిరాశతో వెళ్తున్నారు. నిత్యం స్వామివారి దర్శనానికి 20 వేల మంది భక్తులు తరలివచ్చి హుండీల్లో నగదు, కానుకలు వేస్తుంటారు. హనుమాన్ జయంతి ఉత్సవాల సమయంలో లక్షల్లో వస్తుంటారు. కొందరు వెంట డబ్బులు తీసుకురాలేక ఆన్‌లైన్ సేవలు లేకపోవడంతో విరాళాలు, కానుకలు అందజేయడంలేదు. క్యూఆర్‌కోడ్ లేదా స్వైపింగ్ యంత్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**గతంలో ప్రారంభించినా..**

2017లో అప్పటి జిల్లా కలెక్టరు ఆలయంలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించారు. కొండగట్టు, ధర్మపురి ఆలయాల్లో భక్తులు ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఓ బ్యాంకుకు చెందిన సిబ్బంది స్వైపింగ్ యంత్రంతో ఆలయంలో ఆన్‌లైన్ సేవలకు శ్రీకారం చుట్టినప్పటికీ కొండపైన సెల్‌టవర్ సిగ్నల్ వ్యవస్థలేక రెండు రోజులకే నిలిపివేశారు.

**నగదు రహిత చెల్లింపులకు కృషి**

కొండగట్టులో చరవాణి సిగ్నల్ అందకపోవడంతో భక్తులకు కొంత ఇబ్బంది కలుగుతోంది. సెల్‌టవర్ నిర్మాణం కోసం గతంలో కొండపై స్థలం కావాలని ఓ కంపెనీకి చెందిన అధికారులు అడిగారు. నిబంధనల ప్రకారం ఆలయ భూముల్లో నిర్మాణాలకు దేవాదాయశాఖ కమిషనరు అనుమతితోపాటు అద్దె చెల్లించాల్సి ఉంటుంది. అందుకు ప్రైవేటు కంపెనీ వారు అంగీకరించలేదు. త్వరలో కొండపైన అన్ని సేవలు, అన్నదాన విరాళాల కోసం ఆన్‌లైన్ ద్వారా నగదు రహిత చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటాం. - కృష్ణప్రసాద్, అంజన్న ఆలయ ఈవో కొండగట్టు

# మండీలోనే మామిడి కొనుగోలు



జగిత్యాల : జగిత్యాల చల్‌గల్ మామిడిమండీలో ఈ సీజన్‌లో పలు చర్యలకు అధికారులు సిద్ధమయ్యారు. రూ.6 కోట్ల వ్యయంతో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన 4 భారీ షెడ్లు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాగా..వాలంతరి ప్రదర్శన క్షేత్రం నుంచి అదనంగా తీసుకున్న 10 ఎకరాల స్థలంలోనూ మామిడి కాయల లావాదేవీలు నిర్వహించనుండటం కలిసిరానుంది. కేవలం మామిడి కాయల క్రయవిక్రయాల సీజన్‌లోనే వినియోగించి నిరుపయోగంగా ఉంచే బదులు చల్‌గల్ మండీని శాశ్వత పండ్లమార్కెట్‌గా మార్చేందుకు గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర బడ్జెట్లో ప్రభుత్వం నిధులు కేటాయించేలా ప్రజాప్రతినిధులు కృషిచేయాల్సి ఉంది.ప్రభుత్వయార్డు అందుబాటులోకి రావటంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ సీజన్‌లో దాదాపు 90 మందికిపైగా వ్యాపారులు మామిడి క్రయవిక్రయాలు జరిపేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యార్డులోనే మామిడి కాయల కొనుగోలు, ప్యాకింగ్, తరలింపు తదితర కార్యకలాపాలు చేపట్టేలా అంతర్గత రహదారులు, విద్యుత్తు తదితర సదుపాయాలు కల్పిస్తున్నారు. దిల్లీ, నాగ్‌పూర్, హైదరాబాద్, విజయవాడ తదితర మార్కెట్ల ధరలు తెలిపేలా చల్‌గల్ మండీలో ఆన్‌లైన్ తెర ఏర్పాటుచేసి ధరలను ప్రదర్శిస్తే రైతులకు మేలు కలగనుంది. ఈ సీజన్‌లోనూ కిసాన్‌రైలు ద్వారా ఉత్తరాది రాష్ట్రాలకు కాయల తరలింపు ధరల స్థిరత్వం తేనుంది.

చల్‌గల్ యార్డులోని రైపెనింగ్ ఛాంబర్‌తో పాటు రెండు ధర్మకాంటాలను వినియోగించాలి. నిబంధనల ప్రకారం కమీషన్ తీసుకునే వ్యాపారులు కాయలను బహిరంగ వేలం పద్ధతిన కొనుగోలు చేయాలి. గతంలో యార్డులో అభివృద్ధి పనులు పూర్తిగాకపోవటం, వ్యాపారులు వారి సొంతస్థలాల్లోనే సేకరణ చేసినందున వేలానికి వీలుకాలేదు. ప్రస్తుతం యార్డులోనే పూర్తి క్రయవిక్రయాలు సాగనున్నందున వేలంపద్ధతిని పాటిస్తే ధరలు పెరిగి రైతులకు లాభిస్తుంది. ప్రభుత్వం ఎఫ్‌పీవోలు, మహిళా సంఘాలద్వారా కాయల కొనుగోలు, ఉద్యానశాఖ, అపెడ ద్వారా జగిత్యాల బ్రాండ్ పేరిట కాయల ఎగుమతికి చర్యలు చేపడితే కర్షకులకు మరింత మేలు కలుగుతుంది. దశలవారీగా అభివృద్ధిమామిడి మండీ, దినుసుల బీటులో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నాము. ఈ సీజనుకు యార్డులోనే మామిడికాయల లావాదేవీలు జరపాలి. కాయల బహిరంగ వేలానికి చర్యలు తీసుకుంటాం.- టి.రాజశేఖర్, మార్కెట్ కమిటీ కార్యదర్శి

# 8 కారిడార్లలో రవాణా ఆధారిత అభివృద్ధి

హైదరాబాద్: మహానగరంలో మరిన్ని రవాణా ఆధారిత అభివృద్ధి(టీవోడీ) కారిడార్లకు హెచ్ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఈ కారిడార్ల లో ప్రత్యేక వ్యాపార, వాణిజ్య జోన్ల కోసం లోకల్ ఏరియా ప్లాన్‌లకు రూపకల్పన చేసేలా తాజా నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా కారిడార్లలో రోడ్లకు ఇరువైపులా 500 మీటర్ల వరకు ప్రత్యేక నిబంధనలను వర్తింపజేయనున్నారు. అనుమతుల్లో రాయితీలు ఇవ్వనున్నారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలోని యూనిఫైడ్ మెట్రోపాలిట్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ(ఉమ్టా) ప్రత్యేకంగా 2050 అవసరాల కోసం కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ)కు రూపకల్పన చేస్తోంది. మాస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్‌లో భాగమైన 8 కారిడార్లను టీవోడీ కార్యకలాపాలకు అనుగుణంగా నిబంధనలు రూపొందించనున్నారు. వాటి కోసం లోకల్ ఏరియా ప్లాన్‌లను తయారు చేయనున్నారు.

**ఎంపిక చేసిన మార్గాలివే..**

మియాపూర్ నుంచి ఎల్‌బీనగర్
జూబ్లీబస్సు స్టేషన్(జేబీఎస్) నుంచి మహాత్మాగాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్)
నాగోలు నుంచి రాయదుర్గ్
ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట
మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి బీహెచ్ఈఎల్, పటాన్‌చెరు
ఎల్‌బీనగర్ నుంచి వనస్థలిపురం, హయత్‌నగర్
మెట్టుగూడ నుంచి మల్కాజిగిరి, ఈసీఐఎల్ క్రాస్‌రోడ్డు
పటాన్‌చెరు నుంచి ఓఆర్ఆర్ జంక్షన్, ఇస్నాపూర్

